ఈ రోడ్ ఎక్కడికి అని ఎవడో కవి అడిగాడ్ట - ఏ రోడ్ ఎక్కడికి వెళ్ళినా నువ్ ఎక్కడికెళ్ళాలో అక్కడికే వెళ్తావు. కాని రోడ్ చివరికంటూ వెళ్ళలేవు కదా అన్నాడ్ట వో నిరాశావాది.

రోడ్ అనేది వేస్తే నేను కాకపోతే నా మనవడేనా వెళ్తాడన్నాడ్ట ఆశావాది!

అందుకే 'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అన్నట్లు కవి సంధ్యావందనం చేస్తూ రోడ్లకు నమస్కరిస్తున్నాడు.

# రౌడీ రాణి

వేదాల్లో అన్నీ వున్నాయంటారుగాని వేదకాలంలో ఇన్ని మునిసిపల్ టాక్సులూ, నీటి పన్నులూ, ఎలక్ట్రీబిల్లులూ వుండేవా? దేవుళ్ళు మటుకు గద్దనో, హంసనో, నెమలినో, పులినో, సింహాన్నో ఎక్కి తిరిగేవారు గనుక డీసెల్, పెట్రోలు ధరలు పెరిగినా వాళ్ళకేం యిబ్బంది లేదు. మన పురాణ పురుషులకి ఎంతమంది భార్యలూ, సంసారాలున్నా వాళ్ళకిగుళ్ళూ, గోపురాలు వుంటాయి గనుక అద్దెకొంపల అగచాట్లు వారికి తెలీవు. ఋషులూ, మునిపత్నులూ అవుట్ డోర్‌లో, ఆశ్రమాల్లో వుంటారు గనుక మురిక్కాలవల సంగతీ పంపుల్లోంచి నీళ్ళు రాక పోవడం, గ్యాస్ సడెన్‌గా అయిపోయి వంటమధ్యలో ఇల్లాలు కుదేలైపోయి కాళ్ళూ, చేతులూ బాదుకోవడం ఆ మహా పతివ్రతలు ఎరగ రెరగరు. ఈ రోజుల్లో లాగా ఈ జానెడు బెత్తెడు జాగాల్లో పవర్ సరిగాలేక, శాలరీలు చాలక, పిల్లల్తో జల్లల్తో సంసారాలీదవడం మజాకా కాదని ఆ పతివ్రతలకు తెలియదు. బస్సులో సీటు దొరకడం నుంచి స్కూల్లో, కాలేజీల్లో పిల్లలకి సీట్లు తెప్పించి వాళ్ళని చేర్చేసరికి చుక్కలు కనిపిస్తాయి. అప్పటి పతివ్రతలకు మొగుడి కాళ్ళు పిసకడం, నెత్తిమీద గంపలో కూర్చోపెట్టుకుని ముండ యింటికి తీసుకెళ్ళడం, తెల్లారడానికి వీల్లేదని సూర్యభగవానుడ్ని శపించడం పాపం యివే గొప్ప విషయాలు.

కాని, ఈనాటి పతివ్రతల కష్టాలతో పోలిస్తే వాళ్ళవి అవుట్ డేటెడ్ కష్టాలు. ఇల్లు విషయమే తీసుకోండి. ఇల్లు చూసి ఇల్లాలిని చూడమన్నారు. మళ్ళీ వాళ్ళే ఇల్లు యిరకాటం ఆలి మర్కటం అన్నారు. అన్యాయం; ఈ రోజుల్లో ఇల్లాలిని చూసి ఇల్లు జడ్జి చెయ్యడానికి వీల్లేదు. దొరికిన యింట్లో తలదాచుకుంటున్నారు. తోటలూ దొడ్లూ, ఉద్యానవనాలు, లతానికుంజాలు లేనేలేవు. ఒకటిన్నర, రెండున్నర గది వాటాలే యెక్కువ. డ్రాయింగ్‌రూములూ, బెడ్రూములూ, డైనింగ్ హాల్సు యెందరి కున్నాయి? మంచం వాలిస్తే కుర్చీ వేయడానికి వీల్లేదు. కుర్చీవాలిస్తే మంచం యెత్తేసెయ్యాలి. ఇలాటి యిళ్ళలో నీళ్ళు లేక, పనివాళ్ళు సరిగా రాక సతమతమయే చిన్నారి ఇల్లాలు పగటి కలలూ, వరసగా పిల్లల్ని తప్ప మరింకేం కనగలదు? ఇప్పుడు ఇంట్లో బట్టలన్నీ మెరుపుల్తో తళతళలాడేలా వుతికి, ఆరేసి, ఇస్త్రీ చేయించే లాండ్రీ సమస్య కూడా ఇల్లాలి

నెత్తిమీదే పడిందికాదా? ఈ ట్రాజెడీ నుంచి ఆడదాన్ని రక్షించలేరా మహాప్రభో అంటే వ్యవస్థ మారేదాకా ఆగు. పీడిత ప్రజానీకం సమస్యలన్నీ అయాక నీది. ఈ సినిమాల్నీ, ఈ నవలల్నీ ఈ ప్రతికల్నీ, ఈ ఫ్యాషన్లూ డ్రెస్సుల్నీ పోషిస్తున్నది నువ్వే. నువ్వు బూర్జువా కనకదుర్గవి. నువ్వే నాలుక బయట పెట్టి కలకత్తా కాళిలా అయినప్పుడు అదే మారుతుంది. ముందు ఎదురుతిరుగు. మీ వారిచేత అంట్లు తోమించు, బట్టలుతికించు, కూరలు తరిగించు – విప్లవం నీ యింట్లోంచే రావాలి అని మా బూర్జువా మావయ్య మావూళ్ళో మేష్టారి మనవరాల్తో లెక్చరు దంచుతూండగా విన్నాను. మా మేష్టారి మనవరాలు చాలాచలాకీ అయిన పిల్ల. దాన్ని అత్తారింటో క్రూయల్‌గా నేస్టీగా చూసి నానా చాకిరీ చేయించి అల్లరి పెట్టేవార్ట. ఓ రోజు ఫామిలీ అంతా సినిమా హాల్లో కూర్చుని చూస్తూ వుండగా, పిక్చర్ మధ్యలో వాళ్ళాయన పర్స్ కొట్టేసి హాల్లోంచి వచ్చేసి బస్సెక్కి పుట్టింటికి వచ్చేసింది. బ్రేవ్‌గర్ల్. అందుకే ఆడపిల్లలకి పిక్‌పాకెటింగ్ హాబీగా నేర్పాలి. కనీసం మొగుడి జేబైనా కత్తిరించుకు బతికి బయటపడగల్రు. మా మేష్టారి మనవరాలి గురించి కదూ చెప్తున్నా. అది కాపరానికి వెళ్ళిన మొదటిరోజు టిఫిన్ పెట్టకపోయేసరికి అత్తగారిని వీపు మీద కొరికేసిందట. (వీపుమీద కొరికితే గోక్కోలేదు కదా;) అప్పుడు వాళ్లు మేష్టారికి ఉత్తరం రాస్తే ఆయన జవాబిచ్చాడు – "అవునండీ అప్ప గింతలప్పుడు చెప్పడం మర్చిపోయాను. దానికి ఆకలెక్కువ. టిఫిన్ పెట్టకపోతే కొరుకుతుంది అని". దానిమొగుడు లబోదిబోమంటూ వచ్చాడు – "మీ అమ్మాయి సినిమాహాల్లో నా జేబుకొట్టేసి పారిపోయి వచ్చిందండీ" అంటూ. "పాకెట్ మనీ యివ్వకపోతే యిక్కడా అది నాజేబు కొట్టేస్తూ వుండేది. పర్స్ జాగ్రత్తగా పెట్టుకోవాలి నాయనా" అని తాతగారు గాంధీతాతలా, బోసినవ్వులు చిమ్ముతూ "అల్లరిపిల్ల, చురుకెక్కువ" అన్నార్ట. కార్యంనాడు పెళ్ళికొడుకు డ్రెస్సులుతెచ్చి బాత్రూంలో దాచి తలుపు గొళ్ళెంపెట్టి ఏవిటీ అఘాయిత్యవంటే 'ఏప్రిల్‌ఫూల్' అందిట. ఏప్రిల్ ఫస్టనాడు దానికి శోభనం ఏర్పాటు చేయడం పెద్ద తప్పయి పోయిందండీ అన్నార్ట వాళ్ళ వాళ్ళు, పిల్ల సిసింద్రీలా వుందని చేసుకున్నాం, దీన్తో యెల్లాగండీ వేగడం అని వాళ్ళు బెంబేలు పడిపోయార్ట. ఇంతకీ ఆ మొదటిరాత్రి పెళ్ళికొడుకు పక్కమీద దుప్పటీ కప్పుకుని వాళ్ళ అమ్మగారొచ్చి చెర విడిపించే దాకా రెన్ గ్రామరు చదువుకుంటూ వుండి పోయాడ్ట గదిలో. రెన్ గ్రామరు కార్యం గదిలో కెలా వచ్చిందని హాశ్చర్యం పడిపోతున్నారా? పెళ్ళికూతురు పరుపుకింద సివిక్సూ, రెన్ గ్రామరూ, బాలవ్యాకరణం దాచిందట.

ఈ అమ్మాయిని కాపరానికి తీసుకెళ్తూ పెళ్ళివారు రైల్లో కూచోపెట్టి చెరోపక్క చెరో ముసలమ్మ బాడీగార్డుల్లా కూర్చున్నారు. పెళ్ళికొడుకు రైలుదిగి పచార్లు చేస్తూంటే గుండుమరచెంబు అతని మీదకు విసిరేసిందట నీళ్ళు తెమ్మని, ఆ మరచెంబు తగిలి ఆకుర్రాడు బ్యార్‌మన్నాడట. వెర్రికోపంతో ఆ అబ్బాయి లోపలి కొచ్చి అమ్మాయి జుట్టుపట్టుకుని వీప్మీద రెండు తగల్నిచ్చే సరికి కొంచెం సేపాగి రైలు బాగా వేగం పుంజుకున్నాక లేచి వెళ్ళి గొలుసు లాగిందట. రైలాగింది. పోలోమని జనం గొడవ. అపరాధ రుసుం కింద రెండొందలయాభై కట్టించేరట

పెళ్ళి వారిచేత రైల్వేవాళ్ళు. ఈ సంగతులన్నీ రాస్తే వాళ్ళ తాతగారు "దానికడుపునో కాయకాస్తే అన్నీ అవే సర్దుకుంటాయి" అన్నార్ట. "కాపరంచేసే పిల్ల యిల్లా బరితెగించిఅస్తమానం పుట్టింటికి పారిపోయివస్తే మాకెంత తలవంపులూ" అని పిల్లాడి తరపున పెద్దవాళ్ళు ఫిర్యాదుచేస్తే "సీజన్ టిక్కెట్టు కొనివ్వండి - అదే చవక. వస్తూపోతూ వుంటుంది. దాని గుబులు తీరాక అదే మానేస్తుంది" అన్నార్ట తాతగారు. తాతగారికి లక్షరూపాయల రొక్కం, మావిడితోటలూ, కొబ్బరితోటలూ, పొలాలూ, దొడ్లూ మస్తుగా వున్నాయట. ఆయనే మనవరాల్ని పెంచి అతి గారంచేసి పాడుచేశాడంటారు. ఆ అమ్మాయి మాత్రం అత్తారింట్లో సింహస్వప్నం. హృదయరాణి కావాలంటే రౌడీరాణిని తెచ్చి అంటగట్టా రేమిటా అని ఆ వరుడు వగచి విలపిస్తూ వుంటాడని అంటారు. వగచి విలపించుటకంటె రౌడీరాణిని వలచి వలపింప మేలురా అని చెప్పాలని వుంటుంది. మామేష్టారి మనవరాలి గురించిన చింకి లెక్చరు యింతటితో సమాప్తం;

# పాతాళభైరవి

మన పెద్దవాళ్ళకి నైంటీనైన్ పర్సంటు పెళ్ళిచేసేదాకా సరదాయేగాని పెళ్ళాడినవాళ్ళ సరదాలు తెలియవు. పుష్కరాలొస్తున్నాయనో, శూన్యమాసవనో, మూఢవనో యిన్నోటి యిబ్బందుల్లో కుర్రజంటలు - అంటే కొత్తగా పెళ్ళయిన వాళ్ళకి ఏ సరదా తీరకుండా సమ్మరొచ్చేస్తే నిమ్మకాయసోడాలు, కొబ్బరి బొండాలు, పెద్ద రసాలు, కూజా నీళ్ళూ, కొత్తపచ్చళ్ళు వాళ్ళ విరహాగ్నిని చల్లార్చగలవా? లేవులేవు. బయట పడుకోండి. బయట పడుకోండి, చల్లగా గాలేస్తుంది గాలేస్తుంది అని పెద్దవాళ్ళు నిర్మోహంగా అంటారుగాని అప్పుడప్పుడే పెళ్ళయినవాళ్ళకు ఈ హితోపదేశాలు, సుభాషితాలు, వెదర్ లెక్చర్లూ తడికమీద నీళ్లు జల్లినట్లే. పెళ్ళయినవాళ్ళకు గదులివ్వకపోవడం (ఆఖరికి అన్నాల్తిన్నాక కడిగిన కిచెనయినా) చెంబివ్వకుండా పాలు పితకమనడం లాటిది. మరింకా రాచిప్పలేకుండా పులుసు కాచమనడంలాటిది. దారం లేకుండా పూలదండ గుచ్చమనడంలాటిది. సమ్మరంటే మనకి భయం కాని కొత్తగా పెళ్ళయిన వాళ్ళకి ఏం భయం? నవయువతీ యువకుల దాంపత్యశోభకు కాలం వంగి సలాం చేస్తుంది. ఆకాశం మంగలాక్షతలు జల్లుతుంది. చందమామ ఫోటోలు తీస్తాడు లవ్ సీన్లని. సృష్టి విలాసాన్ని ప్రకృతి ఎదిరించదు. లేకపోతే మామిడిచెట్టు మీద కోకిల అరుగుమీద కూర్చుని బీడీలు కాల్చుకునేవాళ్ల కోసమా కూస్తూంట. ఎవరికి అవసరమో వారికొరకే.

ఇంట్లో వాళ్ళ నాన్ కోపరేషన్ వలన, ఇమాజినేషన్ లేని పెద్దరికాలవలన ఇంటిబ్బందుల వలన విశ్రమించే సదుపాయం లేక, ఎన్ని లేత హృదయాలు నలిగిపోతున్నాయో ఎవరయినా